క్లుప్తంగా

నిలిచిన బీఎస్ఎన్ఎల్ సేవలు

మహదేవపూర్: మండలంలో రెండు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ ద్వారా సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయకపోవడంతో బ్యాంకింగ్ రంగం, ప్రభుత్వ కార్యాలయాలు, బీఎస్ఎన్ఎల్ సెల్ ఫోన్ వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై ఆ సంస్థ జేఈ మాహంతిని వివరణ కోరగా కరీంనగర్‌లోని టవర్ సర్కిల్ వద్ద బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో అగ్నిప్రమాదం జరగడం వల్ల సేవలు నిలిచిపోయాయని తెలిపారు. త్వరలోనే పునరుద్ధరిస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

హుండీ ఆదాయం రూ.62,341



టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేటలో ఇటీవల ఎల్లమ్మతల్లి పట్నాల సందర్భంగా నిర్వహించిన జాతర హుండీని ఆలయ కమిటీ సభ్యులు గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.62,341 ఆదాయం వచ్చినట్లు కమిటీ అధ్యక్షుడు వంగ ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చదువు మధురమహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వంగ రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు, తుమ్మేటి సురేందర్ రెడ్డి, వంగ కుమారస్వామి, పసరగొండ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపిక

టేకుమట్ల: మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైనట్లు ఎంపీడీఓ అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పావర్టీ ఫ్రీ అండ్ ఎన్‌హాన్స్‌డ్ లైవ్ లీహుడ్, హెల్తీ, చైల్డ్ ఫ్రెండ్లీ, వాటర్ సఫీషియెంట్, క్లీన్ అండ్ గ్రీన్, సెల్ఫ్ సఫీసియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సోషల్ సెక్యూర్డ్, ఉమెన్ ఫ్రెండ్లీ థీమ్‌లలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గర్మిళ్లపల్లి, ఎంపేడు, రాఘవాపూర్, అంకుషాపూర్, రాఘవరెడ్డిపేట, రామకిష్టాపూర్(టి), వెంకట్రావుపల్లి, ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి, వెలిశాల, టేకుమట్ల, బూర్నపల్లి, మందలోరిపల్లి, కుందనపల్లి గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు.

రేగొండలో..

రేగొండ మండలంలోని పొనగల్లు, వెంకటేశ్వర్లపల్లి, దమ్మన్నపేట గ్రామ పంచాయితీలు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అవార్డు అందుకోనున్నట్లు ఎంపీడీఓ సురేందర్ తెలిపారు.

పరామర్శ

కాటారం: మండలంలోని పోతులవాయి గ్రామానికి చెందిన రాసమల్ల నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేశ్ గురువారం పరామర్శించారు. నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు జక్కు రాకేశ్, మండల అధ్యక్షుడు తోట జనార్దన్, కాళేశ్వర దేవస్థాన చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకుల నివాళి

సీనియర్ అంబేడ్కరిస్ట్ రాసమల్ల నర్సయ్య మృతిపై సంతాపం ప్రకటిస్తూ కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బీఎస్పీ, ఎస్ఎస్‌డీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుగుల రాజన్న, ఎస్ఎస్‌డీ జిల్లా అధ్యక్షుడు ముద్దమల్ల భార్గవ్, బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రాజ్‌కుమార్, రాజబాబు, శివకుమార్, మల్లేశ్, కొండయ్య, బాపుయాదవ్ పాల్గొన్నారు.

పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి

మహాముత్తారం: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణితో కలిసి రెడ్డిపల్లికి బస్సు సౌకర్యాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం బస్సులోనే మహాముత్తారం నుంచి రెడ్డిపల్లి వరకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డ అనంతరం సీఎం కేసీఆర్ అండదండలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని అన్నారు. అదే విధంగా మారుమూల పల్లెలకు బ్రిడ్జిలతో పాటు రోడ్డు సౌకర్యం తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాకనే మెరుగుపడ్డాయని గుర్తు చేశారు. కాంగ్రెస్‌నాయకులు ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యం అని అన్నారు. శ్రీహర్షిణి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామానికి వచ్చిన సందర్భంగా సర్పంచ్ సూచనల మేరకు గ్రామంలో రోడ్ల నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తామని అన్నారు. అనంతరం గ్రామస్తులు జెడ్పీచైర్‌పర్సన్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విమళ, మాజీ జెడ్పీటీసీ మందల రాజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సోమశాంతకుమార్, రైతుబంధు అధ్యక్షుడు మార్క రాము, మాజీ ఎంపీపీ మెండ వెంకటస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



బస్సులో ప్రయాణిస్తున్న పుట్ట మధు, శ్రీహర్షిణి

రేపు పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభం

● హోంమంత్రి, డీజీపీ రాక!

కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జిల్లాలోని కాళేశ్వరంలో పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఈనెల 25న ప్రారంభించడానికి పోలీసు యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తుంది. రూ.1.50కోట్లతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణం చేశారు. రెండున్నరేళ్లుగా నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభాన్ని హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజన్‌కుమార్‌లతో పాటు ఇతర పోలీసుశాఖ అధికారులు భూపాలపల్లిలో వర్చువల్ స్క్రీన్‌పై ప్రారంభిస్తారా లేదా నేరుగా కాళేశ్వరం వచ్చి ప్రారంభిస్తారా తెలియాల్సి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2016లో దసరా కానుకగా కొత్త పోలీసుస్టేషన్‌లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే మహదేవపూర్ సర్కిల్ పరిధిలో కాళేశ్వరం, పలిమెల పోలీసుస్టేషన్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాళేశ్వరం పోలీసుస్టేషన్ భవనం పూర్తికావడంతో పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాళేశ్వరం పోలీసుస్టేషన్‌కు సంబంధించి ఇప్పటికే కన్నెపల్లిలోని సీఆర్పీఎఫ్ భవనంలో పోలీసు కార్యకలాపాలు, సేవలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. భవనం ప్రారంభంతో పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానుందని పోలీసులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.



పోలీసుస్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ..

కాళేశ్వరం పోలీసుస్టేషన్ భవనం ప్రారంభం నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. భవనంలోని గదులను క్షుణ్ణంగా పరిశీలించి ఏర్పాట్లపై సలహాలు, సూచనలను పోలీసు అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఐ కిరణ్, ఎస్సై లక్ష్మణ్‌రావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలి

భూపాలపల్లి అర్బన్: దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డు ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని పట్టణంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు సోత్కు ప్రవీణ్, వేముల శ్రీకాంత్ మాట్లాడుతూ... భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరెళ్ల జోసెఫ్, పోతుల పవన్, పంగా మహేందర్, జడల రాజేశ్వరి, గుండారపు సాయి, పెండ్యాల సాయిచందన, తిరుపతి, వెంకటేష్, ప్రేమ్‌కుమార్‌లు, తదిరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రాపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆప్ ఆధ్వర్యంలో..

ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నాగుల అరవింద్ భగత్‌సింగ్ చిత్రాపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, తిరుపతి, వినీత్, శేఖర్, హరీష్, మహేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత



బాధితురాలికి బ్యాగు అందజేస్తున్న పోలీసులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని రాంనగర్‌కు చెందిన హిమబిందు అనే మహిళ గురువారం భూపాలపల్లి నుంచి రాంనగర్‌కు వెళ్తున్న క్రమంలో ఆటోలో బ్యాగు మరిచిపోయింది. ఈ విషయం సంతలో విధులు నిర్వహిస్తున్న పెట్రో కార్ ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు తెలిపింది. వెంటనే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ అట్టి ఆటోను కనిపెట్టి బాధితురాలికి బ్యాగు అందజేశాడు. అందులో పదివేల రూపాయలు, ఇతర సామగ్రి ఉన్నాయి. ఈ సందర్భంగా హిమబిందు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. తక్షణమే స్పందించి ఆటోలో మర్చిపోయిన బ్యాగును కనిపెట్టి అందించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులతో పాటు పట్టణ ప్రజలు అభినందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మొగుళ్లపల్లి: పౌష్టికాహారంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని సీడీపీఓ అవంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాల్గొవ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ప్రతిరోజు భోజనం చేయలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధర్మారావు, సూపర్‌వైజర్ రజిత, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు వెన్నెల, రజిత, స్వప్న,ఆయా దమయంతి, పిల్లలు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్‌లు బిల్లకంటి ఉమేందర్‌రావు ఆధ్వర్యంలో గురువారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ మాట్లాడుతూ చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమని అన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని అందిస్తారని, కావున అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శైలజ, పద్మ, వరుణ, విజయ, సునీత పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు



చిట్యాల: పోలీస్ స్టేషన్‌లో నాయకులు

చిట్యాల: న్యాయం కోసం పోరాటం చేసే తమను అక్రమంగా అరెస్టులు చేసి భయపెట్టలేరని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మధువంశీకృష్ణ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి నిరసనగా సిట్ ఆఫీస్ ముట్టడికి వెళ్తున్న నాయకులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మధువంశీకృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు సిట్ ఆఫీస్ ముట్టడికి వెళ్తున్న తమను అడ్డుకొని అరెస్టులు చేయడం సిగ్గుచేటని అన్నారు. చిట్యాల మాజీ సర్పంచ్ చిలుకల రాయకొమురు, ఎంపీటీసీ దబ్బెట అనిల్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ఉపాధ్యక్షుడు అల్లకొండ కుమార్, నవాబుపేట గ్రామ శాఖ అధ్యక్షుడు వలబోజు నరేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు లటికే రాజు, వేణు ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టులు సరికాదని ఆ పార్టీ భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ అన్నారు. సిట్ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని సిట్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న నాయకుల అరెస్టును ఖండిస్తున్నామన్నారు. అరెస్టు అయిన వారిలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పసునూటి రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి అజ్మీరా జంపన్న, జిల్లా కోశాధికారి వెన్నపురెడ్డి మహేష్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, నాయకులు బొడ్డు అశోక్, పిప్పాల రాజేందర్, చుంచుల మహేష్, శనిగరపు పవన్ ఉన్నారు.

మహదేవపూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సిట్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న మహదేవపూర్ మండల కాంగ్రెస్ నాయకులను పోలీస్‌లు అరెస్టు చేశారు. మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్సార్ ఖురేషి, నాయకులు పూసల హరీష్, నయుబుద్దిన్, సోహెల్ తదితరులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

భూపాలపల్లి రూరల్: గంజాయి విక్రయదారులను అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్న సమయంలో బాంబులగడ్డ జాతీయ రహదారిపై పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. ముగ్గరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి అభ్యమైట్లు తెలిపారు. అందులో కాటారానికి చెందిన సోనారి వెంకటేష్, మహాముత్తారానికి చెందిన బౌత్ ఆకాశ్ ఇద్దరు ప్రస్తుతం జవహర్ నగర్ భూపాలపల్లిలో నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ ఇద్దరు మహదేవపూర్ గ్రామానికి చెందిన సుల్తాన్ రాకేష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి భూపాలపల్లిలో అవసరం ఉన్నవారికి ఎక్కువ ధరకు అమ్ముతున్నారన్నారు. ఈ క్రమంలో బాంబుల గడ్డ వద్ద సుల్తాన్ రాకేష్ వద్ద గంజాయి తీసుకుని వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముగ్గరిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు వెల్లడించారు.

నిబంధనలు పాటించని బిట్స్ యాజమాన్యం

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ గురువారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో సరిపడా వెలుతురు లేదని, దీంతో గదుల్లో ట్యూబ్‌లైట్లు పెట్టి చదువు నేర్పుతున్నట్లు ఆరోపించారు. దీంతో బోర్డుపైన రాసే అక్షరాలు కనిపించకపోవడంతో విద్యార్థులు కంటి సమస్యల బారిన పడుతున్నట్లు తెలిపారు. విద్యాశాఖ అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, సురేష్, కార్తీక్, అఖిల్, సాయి. చరణ్, నవీన్, శివ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

మహదేవపూర్: మండలంలోని రైతులు పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ చల్లా తిరుపతి అన్నారు. గురువారం సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ప్రస్తుత సంవత్సరం అర్జించిన లావాదేవీల గురించి చర్చించి తీర్మానం చేశారు. సంఘం ప్రస్తుత సంవత్సరము సుమారు రూ.43 లక్షల వార్షిక ఆదాయం గడించినట్లు వెల్లడించారు. ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ గుడాల అరుణ, మహదేవపూర్ సర్పంచ్ శ్రీపతి బాపు, కాళేశ్వరం టెంపుల్ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు, కాటారం ఏఎంసీ చైర్‌పర్సన్ పెండ్యాల మమత, కార్యవర్గ సభ్యులు ఇబ్రహీంఖాన్, సుధాకర్, సవిత, తిరుపతి పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన కాళేశ్వరం టెంపుల్ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు, ధర్మకర్తలు దేవేందర్, సమ్మయ్య, సిద్ధాంతి భాను ప్రకాష్‌లను తదితరులును పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న చైర్మన్ తిరుపతి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ జట్టులో కాటారం గిరిజన సంక్షేమ కళాశాల హ్యాండ్ బాల్ అకాడమీ విద్యార్థులు జితేందర్, అశోక్ ఉన్నారు. ఈ నెల 27 నుంచి అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరిగబోయే జాతీయ స్థాయి బాలుర సబ్ జూనియర్స్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు తరుపున వారు ఇద్దరు పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు కళాశాల విద్యార్థులు ఎంపికవడంపై ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ సిరిసిల్ల శ్రీనివాస్, తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, ఉమ్మడి కరీంనరగ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, లక్ష్మణ్, కోచ్ వెంకటేశ్, పీడీ మంథెన శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

చిట్యాల: బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని బాలల పరిరక్షణ అధికారి రాజకొమురయ్య అన్నారు. గురువారం మండలంలోని చల్లగరిగ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ కర్రె మంజుల అధ్యక్షతన పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలు, సమతుల్య ఆహారంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకొమురయ్య మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి 15 మందితో కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బాలల సంరక్షణే ధ్యేయంగా ఈ కమిటీలు పనిచేస్తాయని, ఈ కమిటీ చైర్మన్‌గా సర్పంచ్ మంజుల, కార్యదర్శిగా పంచాయతీ కార్యదర్శి మహేష్, కన్వీనర్‌గా స్థానిక అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ వ్యవహరిస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సోమేష్‌కుమార్, భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో స్వచ్ఛభారత్ మిషన్ శిక్షణ

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని రైతు వేదికలో స్వచ్ఛ భారత్ మిషన్ శిక్షణలో భాగంగా ఫీల్డ్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విలేజ్ మ్యాప్ వేసి గ్రామంలో ఉన్న పరిస్థితుల గురించి జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ అధికారులు వెంకటేష్, భాస్కర్ వివరించారు. అదేవిధంగా ఒకే గుంత ఉన్న మరుగుదొడ్డికి రెండు గుంతల విధానం గురించి, కమ్యూనిటీ సోప్‌పేట్ గురించి ప్రత్యక్షంగా టెక్నికల్ అంశాలను అధికారులు వివరించారు. అనంతరం గ్రామంలో ఉన్న గృహాల శానిటేషన్ స్థితిగతులపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడి మొండయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్ మిషన్ శిక్షణలో పాల్గొన్న అధికారులు

ఆదరణను చూసి ఓర్వలేకనే కేసులు

టేకుమట్ల(రేగొండ): రాహుల్‌గాంధీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే నరేంద్రమోదీ అక్రమ కేసులు పెడుతున్నాడని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. గురువారం రేగొండ మండలంలోని రాయపర్తి, కనిపర్తి, నాగుర్లపల్లి, రాజక్కపల్లి, విజ్జయ్యపల్లి, బాలయ్యపల్లి, చిన్నకోడెపాక, దమ్మన్నపేటలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగింది. బాలయ్యపల్లిలో రాహుల్‌గాంధీ అరెస్టు తీర్పుకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2019లో కర్ణాటక లోక్‌సభ ఎన్నికల రాహుల్ గాంధీపై బీజేపీ పరువునష్టం దావా వేశారన్నారు. ఈ క్రమంలో రాజకీయ కుట్రతోనే రాహుల్ అరెస్టుకు తీర్పునిచ్చారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూటోజు కిష్టయ్య, కనకం రమేష్, పత్తి తిరుపతి, బానోతు రవిందర్, కిరణ్, వీరేందర్, జోరు సుధర్శన్, వీరబ్రహ్మం, గండి తిరుపతి, రవి, బిక్షపతి, సదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతోనే సూరత్ కోర్టు నుంచి రాహుల్‌గాంధీ అరెస్టుకు తీర్పునిచ్చారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆరోపించాడు. రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని కోరుతూ.. కాంగ్రెస్ శ్రేణులు గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం దేవన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజాక్షేత్రంలో బీజేపీ నిరంకుశ వైఖరిని ఎండగడుతూ దేశ సమగ్రత కోసం పార్టీ పోరాడుతుందన్నారు. రాహుల్ గాంధీ దేశాన్ని ఏకం చేయడం కోసం భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. జోడోయాత్ర ద్వారా ప్రజలలో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేయబోమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూనమల్ల రాజన్న, రాజేష్, బొడ్డు అశోక్, చల్లూరి సారయ్య, నగునూరి రజినీకాంత్ గౌడ్, సుభాష్, ఉస్మాన్, మహేష్, శనిగరపు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



రేగొండ మండలం బాలయ్యపల్లిలో..

ఆధార్ కార్డు అప్‌డేట్ తప్పనిసరి

చిట్యాల: మండలంలో 2016కు ముందు ఆధార్ కార్డు పొందిన ప్రజలు వెంటనే అప్‌డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ సరికొమ్ముల సమ్మయ్య కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్‌కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనాలు పొందడానికి ఆధార్ కార్డును తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవలసిన అవసరం ఉందన్నారు.



అప్‌డేట్ పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్

రేపు ఇంటర్వ్యూలు

భూపాలపల్లి అర్బన్: కేంద్రంలోని శ్రీ చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రేపు(శనివారం) ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎంఎస్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఐఐటీ సౌజన్యంతో ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాల నియామకం కోసం ఇటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023 సంవత్సరానికి డిగ్రీ పూర్తయిన, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని ఈ అవకాశాన్ని ప్రాంత నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9000544264 నంబర్‌ను సంప్రదించాలన్నారు.